క్లుప్తంగా

అప్రమత్తంగా ఉండండి

నకరికల్లు: తుపాను కారణంగా ప్రాణనష్టం, ఆస్తినష్టం సంభవించకుండా అప్రమత్తంగా ఉండాలని తహసీల్దార్ కె.నగేష్ సోమవారం సిబ్బందికి సూచించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ బాపట్ల, నిజాంపట్నం సమీపంలో తుపాను తీరందాటే అవకాశం ఉందని వాతావరణ శాఖ హెచ్చరికలు జారీ చేసిందని అన్నారు. తుపాను ప్రభావం పల్నాడు జిల్లాపై కూడా అధికంగా ఉండే అవకాశాలు ఉన్నందున జిల్లా కలెక్టర్ ఎల్.శివశంకర్ ఆదేశాల మేరకు అప్రమత్తంగా ఉండాలని సూచించారు. పూరిపాకల్లో, రేకుల ఇళ్లలో, మట్టిగోడల ఇళ్లలో ఉండేవారు జాగ్రత్తగా ఉండాలన్నారు. మట్టిగోడల వెంబడి నిద్రించవద్దన్నారు. ఈదురుగాలులు వీచే అవకాశం ఉన్నందున మరింత అప్రమత్తంగా ఉండాలన్నారు.

సీసీఐ పత్తి కొనుగోళ్లు నిలిపివేత

క్రోసూరు: తుపాను కారణంగా దూళ్లిపాళ్లలోని విజయ ఎంటర్‌ప్రైజర్స్ జిన్నింగ్ మిల్లులో సీసీఐ ద్వారా జరుగుతున్న పత్తి కొనుగోళ్లు తాత్కాలికంగా నిలిపివేస్తున్నట్లు క్రోసూరు మార్కెట్‌యార్డు చైర్మన్ ఈదా సాంబిరెడ్డి సోమవారం తెలిపారు. పెదకూరపాడు నియోజకవర్గంలోని క్రోసూరు, అచ్చంపేట, బెల్లంకొండ, పెదకూరపాడు, అమరావతి మండలాల రైతులు ఈ సమాచారాన్ని తెలుసుకోవాల్సిందిగా కోరారు. వర్షాలు తగ్గిన తరువాత కొనుగోళ్ల పునఃప్రారంభ తేదీని తెలియపరచగలమని చెప్పారు.

అప్రమత్తమైన రెవెన్యూ సిబ్బంది

రాజుపాలెం: మండలంలో మిచౌంగ్ తుపాన్ ప్రభావం వలన జిల్లా కలెక్టర్ ఆదేశాల మేరకు రెవెన్యూ సిబ్బందిని అప్రమత్తం చేసినట్లు తహసీల్దారు నళిని సోమవారం తెలిపారు. తహసీల్దారు కార్యాలయంలో కంట్రోల్ రూమ్ ఏర్పాటు చేసినట్లు తెలిపారు. ఇప్పటికే వీఆర్వోలను వారికి సంబంధించిన గ్రామాలలోనే ఉండాలని, గ్రామస్తులకు ఎలాంటి సమస్య వచ్చిన వెంటనే తెలపాలని అన్నారు. ఈదురుగాలుల వలన రేకుల షెడ్లు వంటివి పడిపోయిన వెంటనే వీఆర్వోల దృష్టికి తీసుకెళ్లాలని సూచించారు. తుపాను వలన పత్తి, మిరప పంటలకు నష్టం జరిగితే ప్రభుత్వం దృష్టికి తీసుకెళతామని చెప్పారు. ప్రజలు ఎలాంటి ఇబ్బందులకైనా గురయితే 9949098622కు ఫోన్ చేయాలని తెలిపారు.

కుటుంబ నియంత్రణపై అవగాహన



ముప్పాళ్ళ: వేసక్టమీ ఆపరేషన్ పక్షోత్సవాలలో భాగంగా మండల కేంద్రమైన ముప్పాళ్ళలో పురుషులకు కుటుంబ నియంత్రణ పద్ధతిపై వైద్య ఆరోగ్య శాఖ ఆధ్వర్యంలో సోమవారం అవగాహన కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమంలో పాల్గొన్న కమ్యూనిటీ హెల్త్ సూపర్‌వైజరు సీ ఆంజనేయులు మాట్లాడుతూ కుటుంబ నియంత్రణ పాటించటంలో మహిళలతో పాటుగా పురుషులు భాగస్వాములు కావచ్చన్నారు. ఈ విధానంపై అవగాహన కలిగించారు. హెల్త్ ఎడ్యుకేటర్ అనంతలక్ష్మి, హెల్త్ సూపర్‌వైజరు ఏ పీటర్‌డానియేన్, ఏఎన్ఎం జి.జ్యోతి, ఆశ కార్యకర్తలు పాల్గొన్నారు.

నేడు పాఠశాలలకు సెలవు

పెదకూరపాడు: మిచాంగ్ తుపాన్ ప్రభావంతో మండల వ్యాప్తంగా అన్ని ప్రభుత్వ, ప్రైవేటు పాఠశాలలకు మంగళవారం కూడా సెలవు ప్రకటించినట్లు మండల విద్యా శాఖ అధికారి పి.సత్యనారాయణ తెలిపారు. విద్యార్థులు ఇళ్ల వద్దే ఉండాలని సూచించారు.

ఉద్యోగం ఇప్పిస్తానని మోసం

గుంటూరు ఈస్ట్: ఉద్యోగం ఇప్పిస్తానని మోసం చేసిన వ్యక్తిపై అరండల్‌పేట పోలీసులు కేసు నమోదు చేశారు. ఆకులవారితోటలో నివాసం ఉండే కె.కవిత బీటెక్ పూర్తి చేసింది. గత సంవత్సరం మల్లికార్జునపేటకు చెందిన మురళి ఆమెకు పరిచయమయ్యాడు. సాఫ్ట్‌వేర్ ఉద్యోగం ఇప్పిస్తానని నమ్మించాడు. దీనికి కవిత రూ. 2.30 లక్షలు చెల్లించింది. మురళి ఉద్యోగం ఇప్పించకుండా మోసం చేయడంతో సోమవారం పోలీసులకు ఫిర్యాదు చేసింది. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

బ్లేడుతో దాడి చేసిన వ్యక్తిపై కేసు నమోదు

దంపతులపై బ్లేడుతో దాడి చేసిన వ్యక్తిపై నగరంపాలెం పోలీసులు కేసు నమోదు చేశారు. కృష్ణబాబు కాలనీలో నివాసం ఉండే మల్లేశ్వరరావు, భవానీ దంపతులు ఆదివారం ఇంట్లో నిద్రిస్తుండగా, పాత కక్షల నేపథ్యంలో పాలన్ ముగ్దుం బలవంతంగా తలుపులు పగులగొట్టి లోపలకు ప్రవేశించాడు. ఎదురుగా వస్తున్న దంపతులపై బ్లేడుతో దాడిచేసి గాయపరిచాడు. బాధితుల ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

అప్పుల బాధతో వ్యక్తి ఆత్మహత్య

పట్నంబజారు: అప్పుల బాధతో వ్యక్తి ఆత్మహత్యకు పాల్పడిన సంఘటనపై కేసు నమోదైంది. పాత గుంటూరు పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. బాలాజీనగర్ 10వ లైనుకు చెందిన చింతలపూడి శ్రీనివాసరావు (50) పెయింటింగ్ పనులు చేసుకుంటూ జీవనం సాగిస్తున్నారు. ఈ క్రమంలో 2021లో బ్యాంకు రుణం తీసుకుని బాలాజీనగర్ 10వ లైనులో నివాసాన్ని కొనుగోలు చేశారు. దీనితో పాటు పలు క్రెడిట్ కార్డుల అప్పులున్నాయి. వాటిని తీర్చలేకపోవడంతో మనస్తాపానికి గురైన శ్రీనివాసరావు సోమవారం ఇంట్లో ఫ్యాన్‌కు చీరతో ఉరి వేసుకుని ఆత్మహత్యకు పాల్పడ్డాడు.

యక్షస్వరూపాయ.. జటాధరాయ..

- భక్తులతో కిటకిటలాడిన శైవక్షేత్రాలు
- మారుమోగిన శివనామస్మరణ

సత్తెనపల్లి: శైవక్షేత్రాలు హర హర మహాదేవ శంభో శంకర అంటూ భక్తుల శరణుఘోషతో మారుమోగాయి. కార్తీకమాస సోమవారం శివాలయాలు భక్తులతో కిటికిటలాడాయి. తెల్లవారుజాము నుంచే శివాలయాల్లో ప్రత్యేక పూజలు ప్రారంభమయ్యాయి. పట్టణంలోని అచ్చంపేట రోడ్డులో గల దుర్గా అన్నపూర్ణ సమేత కాశీ విశ్వేశ్వరస్వామి దేవాలయం, అమ్మిశెట్టి వారి వీధిలోని త్రికోటేశ్వరస్వామి దేవాలయం, గుంటూరు రోడ్‌లోని సనారి వీరబ్రహ్మేంద్ర ఆశ్రమం, త్రి శక్తి దుర్గా పీఠం, సత్తెనపల్లి మండలం పెద్దమక్కెన గ్రామంలోని గంగా భ్రమరాంబ సమేత మల్లికార్జునస్వామి దేవాలయంతో పాటు పలు ఆలయాలలో భక్తులు పెద్ద సంఖ్యలో హాజరై కార్తీక దీపాలు వెలిగించి ప్రత్యేక అభిషేకాలు, పూజల్లో పాల్గొని స్వామి వారి కృపకు పాత్రులయ్యారు. భక్తులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా ఆయా ఆలయ కమిటీ సభ్యులు ఏర్పాట్లను పర్యవేక్షించారు.

భక్తిశ్రద్ధలతో కార్తీక సోమవార పూజలు

అచ్చంపేట: మండలంలోని పలు శివాలయాలలో కార్తీక సోమవారం పూజలు భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. స్థానిక హరిహర క్షేత్రం గంగా భ్రమరాంబ సమేత మల్లికార్జునస్వామి వారి దేవాలయంలో భక్తులు వేకువజాము నుంచే స్వామి దర్శించుకునేందుకు క్యూకట్టారు. ధ్వజస్తంభం వద్ద కార్తీకా దీపాలు వెలిగించారు. పూజారులు మహన్యాస పూర్వక ఏకాదశ రుద్రాభిషేకాలు, మన్యసూక్త పారాయణ నిర్వహించారు. చామర్రులోని పవిత్ర కృష్ణానది ఒడ్డున వినాయకస్వామి ప్రాంగణంలోని కాశీఅన్నపూర్ణవిశ్వేశ



అచ్చంపేటలోని శివాలయంలో ధ్వజస్తంభం వద్ద కార్తీక దీపాలు వెలిగిస్తున్న భక్తులు



పట్టణంలోని అమ్మిశెట్టివారివీధిలోని త్రికోటేశ్వర స్వామి దేవాలయంలో పూజలు చేస్తున్న భక్తులు

స్వామివారి దేవాలయంలో ప్రత్యేక పూజలు, అభిషేకాలు నిర్వహించారు. నీలకంఠేశ్వరస్వామివారి దేవాలయంలో స్వామివారికి అభిషేకాలు నిర్వహించారు. భక్తులు అధిక సంఖ్యలో తరలివచ్చారు.

ఆలయాల్లో కార్తీక సోమవారం పూజలు

ముప్పాళ్ళ: కార్తీక సోమవారం పురస్కరించుకొని మండలంలోని పలు ఆలయాల్లో స్వామి వార్లకు ప్రత్యేక పూజలు నిర్వహించారు. తెల్లవారుజాము నుంచే భక్తులు ఆలయాల్లో కార్తీక దీపాలు వెలిగించి ప్రత్యేక పూజల్లో పాల్గొన్నారు. మండల కేంద్రమైన ముప్పాళ్ళలోని పార్వతి సమేత రామలింగేశ్వర



ముప్పాళ్ళ శివాలయంలో ప్రత్యేక అలంకరణలో స్వామివారు

స్వామి, అన్నపూర్ణ సమేత కాశీవిశ్వేశ్వరస్వామి, చాగంటివారిపాలెం గ్రామంలోని జగన్నాథస్వామి ఆలయంలో, కుందురువారిపాలెంలోని సాందీపని ఆశ్రమం, వాసవికన్యకాపరమేశ్వరి అమ్మవారి ఆలయం, లంకెలకూరపాడు గ్రామంలోని గంగాపార్వతిసమేత ఓంకారేశ్వరస్వామి ఆలయాల్లో ప్రత్యేక పూజలు, అభిషేకాలు, కుంకుమ పూజలు నిర్వహించారు. ముప్పాళ్ళలోని శివాలయంలో జరిగిన ప్రత్యేక పూజల్లో ఎంపీపీ మారూరి పద్మ దంపతులు పాల్గొని స్వామి వారికి అభిషేక పూజలు నిర్వహించారు.

మిచాంగ్‌పై హై అలర్ట్

- అప్రమత్తమైన అధికార యంత్రాంగం
- రైతులకు అండగా పలు ప్రాంతాల్లో అధికారుల పర్యటన
- మున్సిపల్, రెవెన్యు కార్యాలయాల్లో కంట్రోల్ రూంలు ఏర్పాటు

సత్తెనపల్లి: మిచాంగ్ తీవ్ర తుపానుగా బలపడటంతో అధికార యంత్రాంగం అప్రమత్తమైంది. రైతులతో పాటు సామాన్య ప్రజలకు ఎలాంటి ఇబ్బంది కలగకుండా సహాయక చర్యల్లో నిమగ్నమైంది. జిల్లా అధికారుల ఆదేశాల మేరకు నియోజకవర్గంలోని సత్తెనపల్లి, ముప్పాళ్ళ, రాజుపాలెం, నకరికల్లు మండలాల్లో తహసీల్దార్లు, మున్సిపల్, వ్యవసాయ శాఖ, ఉద్యాన శాఖ అధికారులు ఇప్పటికే పర్యటించారు. తుపాన్ రైతులను ఆందోళనకు గురిచేస్తుంది. దీని ప్రభావంతో వీస్తున్న ఈదురుగాలులకు రైతులు కలవర పడుతున్నారు. భారీ వర్షం పడిన పక్షంలో పంటలు నష్టపోయే అవకాశం ఉండడంతో ముందు జాగ్రత్తగా యంత్రాంగం సూచనలు చేస్తుంది. తుఫాన్ల కారణంగా మున్సిపల్ కార్యాలయం, తహసీల్దార్ కేంద్రాల్లో కంట్రోల్‌రూమ్‌లను ఏర్పాటు చేశారు. నియోజకవర్గ కేంద్రమైన సత్తెనపల్లి తహశీల్దార్ కార్యాలయంలో నిత్యం ఇరువురు సిబ్బంది చొప్పున ఈ



మిరప పంటను క్షేత్ర స్థాయిలో పరిశీలిస్తున్న ఉద్యాన శాఖాధికారిణి జనని

నెల ఆరో తేదీ వరకు అందుబాటులో ఉండేలా వారి ఫోన్ నెంబర్లను సైతం తహసీల్దార్ ఎస్.సురేష్ ప్రకటించారు. అలాగే నియోజకవర్గంలో తుపాన్ ప్రభావం లేకపోయినప్పటికీ పై నుంచి వర్షపు నీరు వచ్చే అవకాశం ఉన్నందున వాగులు, వంకల వద్ద ఎలాంటి ప్రమాదాలు చోటు చేసుకోకుండా రెవెన్యూ సిబ్బందిని అప్రమత్తం చేశారు. ఈదురుగాలులు పెద్దగా లేకపోవడంతో మిరప, వరి పంటలు ప్రస్తుతం పడిపోలేదు. ఉద్యానవన శాఖ అధికారిని సీహెచ్ జనని మండలంలోని పలు గ్రామాల్లో మిరప పంటను సోమవారం పరిశీలించి అధిక వర్షాలు వలన నీరు నిలబడి మిరప పంటకు నష్టం వాటిల్లితే తీసుకోవాల్సిన చర్యలను రైతులకు వివరించారు.

సత్తెనపల్లి తహసీల్దార్ కార్యాలయ కంట్రోల్ రూంలో ఉండే సిబ్బంది..

తేదీ	పేరు, హోదా	సెల్‌నెంబర్
04-12-2023	కె.వెంకటేశ్వర్లు,టైపిస్ట్ షేక్.ఇబ్రహీం వీఆర్‌ఏ	9182826935
04-12-2023	బిఎమ్.తిరుపతిరావు,వీఆర్వో షేక్.మునాఫ్.వీఆర్ఏ	9652049574
05-12-2023	బి.సుబ్బారావు, సీనియర్ అసిస్టెంట్ జి.అరుణకుమార్.వీఆర్ఏ	9704261176
05-12-2023	ఎస్.అనీల్,వీఆర్వో షేక్.మునాఫ్,వీఆర్ఏ	9966843745
06-12-2023	ఎం.ఆదినారాయణ,ఎంఆర్ఐ శృజనా,వీఆర్ఏ	9182454033

స్వర్గీయ మాజీ సీఎం రోశయ్య సేవలు వెలకట్టలేనివి

చాంబర్ ఆఫ్ కామర్స్ అధ్యక్షుడు చల్లంచర్ల సాంబశివరావు

సత్తెనపల్లి: ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ మాజీ ముఖ్యమంత్రి, తమిళనాడు మాజీ గవర్నర్ స్వర్గీయ కొణిజేటి రోశయ్య అందించిన సేవలు వెలకట్టలేనివని చాంబర్ ఆఫ్ కామర్స్ అధ్యక్షుడు చల్లంచర్ల సాంబశివరావు అన్నారు. స్వర్గీయ కొణిజేటి రోశయ్య వర్ధంతి సందర్భంగా సత్తెనపల్లి పట్టణ ఆర్యవైశ్య సంఘం, ఇతర సంఘాల ఆధ్వర్యంలో పట్టణంలోని గాంధీ చౌక్‌లో కొణిజేటి రోశయ్య చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌కు ముఖ్యమంత్రి గాను, తమిళనాడు గవర్నర్‌గా విశిష్ట సేవలందించిన మహోన్నత వ్యక్తి స్వర్గీయ కొణిజేటి రోశయ్య అని ఆయన సేవలను కొనియాడారు. వాణిజ్య విభాగం జిల్లా అధ్యక్షుడు అచ్యుత శివప్రసాద్ మాట్లాడుతూ రోశయ్య నాటి రాజకీయాల్లో అపర చాణక్యుడు అని, ఆయన ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌లో అసెంబ్లీలో ఎక్కువ సార్లు బడ్జెట్ ప్రవేశపెట్టిన గొప్ప వ్యక్తి అన్నారు. విలువలతో కూడిన రాజకీయాలను చేయటమే కాక రాజకీయాల్లోకి రావాలి అనుకొనే నేటి తరం యువత ఆయన రాజకీయ జీవితాన్ని ఆదర్శంగా తీసుకోవాలని అన్నారు. సత్తెనపల్లి ఆ.వో.పా నాయకులు దివ్వెల శ్రీనివాసరావు మాట్లాడుతూ ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌లో ఆర్య వైశ్య మహాసభ దినదినాభివృద్ధి చెందటంలో ముఖ్య భూమిక పోషించిన ఘనత రోశయ్యకే దక్కిందన్నారు. గ్రామీణ ప్రాంతం నుంచి వచ్చి రాజకీయాల్లో ఉన్నత శిఖరాలకు ఎదిగిన మహోన్నత వ్యక్తి రోశయ్య అని అన్నారు. కార్యక్రమంలో యువజన సంఘం అధ్యక్షుడు కొత్త రామకృష్ణ, చలివేంద్ర సంఘం గౌరవ అధ్యక్షుడు జమిలి రాధాకృష్ణ మూర్తి, సహాయ కార్యదర్శి కొత్తూరి విశ్వేశ్వరరావు, కమిటీ సభ్యులు చిలకల శ్రీనివాసరావు, అగ్రికల్చర్ మార్కెటింగ్ మాజీ సభ్యులు, సంఘం రాష్ట్ర నాయకులు దేవతి సుబ్బారావు, సేవా సమితి కోశాధికారి మద్ది వెంకటేశ్వరరావు, తోమంద్రు సురేష్, నోముల సుబ్బారావు, పెరుమాళ్ళ సాంబశివరావు, మట్టా సుబ్రమణ్యం, తల్లం పుల్లారావు, దివ్వెల సతీష్‌కుమార్, కొత్త శ్రీనివాసరావు, నిడమానూరి రమేష్ పాల్గొన్నారు.



గాంధీచౌక్‌లో రోశయ్య చిత్రపటానికి పూలమాలలు వేస్తున్న నాయకులు

విద్యార్థినులకు ట్యాబ్‌లు



శావల్యాపురం: ప్రపంచ దివ్యాంగుల దినోత్సవం సందర్భంగా స్థానిక భవిత సెంటరులో విభిన్నా ప్రతిభావంతులైన విద్యార్థులకు ఆటల పోటీలు నిర్వహించారు. ఈసందర్భంగా ఎంఈఓ మద్దికుంట సాంబశివరావు పాల్గొని మాట్లాడుతూ సమాజంలో దివ్యాంగులను చిన్న చూపు చూడకుడదని, వారిలో ఉన్న ప్రతిభను వెలికితీసి గొప్పవారిని చేయాలన్నారు. ఈ ఏడాది పదో తరగతి చదువుతున్న ప్రత్యేక అవసరాలు కలిగిన ఇద్దరు విద్యార్థినులకు సమగ్ర శిక్ష అభియాన్ సారధ్యంలో ఒక్కోటి రూ. 28 వేల విలువ చేసే ట్యాబ్‌లు అందజేసినట్లు చెప్పారు. భవిత సెంటరులో చేరిన ప్రత్యేక అవసరాలు కల్గిన విద్యార్థులకు వినికిడి పరికాలు, వీల్‌చైర్లు తదితరవన్నీ ప్రభుత్వమే ఉచితంగా మంజూరు చేస్తుందన్నారు. అనంతరం ఆటల పోటీల్లో విజేతలకు బహుమతులు అందజేశారు. ఈకార్యక్రమంలో ఎంఈఓ పుసులూరి లలితాకుమారి, భవిత సెంటరు ఉపాధ్యాయులు కె.జగన్‌మోహన్ పాల్గొన్నారు.

రేపు అబ్దుల్లా బాషా బాబా ఉరుసు

చిలకలూరిపేట: మండలంలోని పోతవరం గ్రామంలో ఉన్న హజరత్ మౌలానా మౌల్వి మొహమ్మద్ అబ్దుల్లాబాషా బాబా 72వ ఉరుసు మహోత్సవం బుధవారం నిర్వహిస్తున్నట్లు దర్గా నిర్వాహకులు తెలిపారు. మౌలానా మౌల్వి మొహమ్మద్ అబ్దుల్లా బాషా తమిళనాడు రాష్ట్రంలోని రాయవేలూరులో జన్మించారు. ఆయన బాకియాతుష్ సలాక్ అనే కళాశాల నుంచి ధార్మిక విద్యలో మౌల్వి పట్టాను పొందారు. మారిఫత్ నయీ గజల్ అనే పుస్తకం రాయడం ద్వారా ఉర్దూ కవుల నుంచి ఖాదరిష్య జలియా అనే బిరుదు పొందారు. 40 ఏళ్ల వయసులో జాతీయ నాయకుల ఉపన్యాసాలకు ప్రభావితమై స్వాతంత్ర్య ఉద్యమంలో పాల్గొన్నారు. సత్యాగ్రహంలో పాల్గొని జైలు శిక్ష అనుభవించారు. అనంతర కాలంలో పోతవరం గ్రామానికి చేరుకొని గ్రామస్తులకు ఆధ్యాత్మిక భావం, పిల్లలకు విద్యాబుద్ధులు నేర్పించేవారు. గ్రామంలో మసీదు నిర్మించి నమాజ్ చేయించేవారు. వనమూలికలతో కులమతాలకు అతీతంగా ఉచితంగా వైద్యం అందించేవారు. అబ్దుల్లాబాష బాబా ఆయన శిష్యులకు తాను 1953వ సంవత్సరం రబ్బీలవల్ మాసంలో శనివారం తుది శ్వాస విడుస్తానని చెప్పారు. సరిగా అదే సమయంలో ఆయన తుది శ్వాస విడిచారు. అప్పటి నుంచి ప్రతి ఏటా ఉర్దూ మాసం రబ్బీలవల్‌లో ఆయన ఉరుసుమహోత్సవం నిర్వహిస్తూ వస్తున్నారు. ఇందులో భాగంగా ఆరో తేదీ ఉరుసు, ఏడున దీపారాధన, అన్నదానం నిర్వహించనున్నారు.

జిల్లా స్థాయి కరాటే పోటీల్లో సత్తెనపల్లి విద్యార్థుల ప్రతిభ

సత్తెనపల్లి: నరసరావుపేట డీఎస్సీ స్టేడియంలోని ఇండోర్‌హాల్‌లో ఈ నెల 3న ఆర్.బి.డ్రాగన్స్ షొటోకాన్ కరాటే డు-ఇండియా సంస్థ ఆధ్వర్యంలో జరిగిన పల్నాడు జిల్లా స్థాయి కరాటే బెల్ట్ టెస్ట్ పోటీల్లో సత్తెనపల్లి విద్యార్థులు ప్రతిభ కనబరిచి గోల్డ్ మెడల్ సాధించారు. ఈ పోటీలకు జిల్లాలోని నలుమూలల నుంచి 256 మంది బాలబాలికలు హాజరయ్యారు. సత్తెనపల్లి వ్యవసాయ మార్కెట్ యార్డ్‌లో సాయిరాం, రవికుమార్ ఆధ్వర్యంలో శిక్షణ తీసుకుంటున్న విద్యార్థులు మంచి ప్రతిభతో బాలికల విభాగంలో యస్.లిఖిత గోల్డ్ మెడల్ సాధించగా, టి.శివశ్రీ, ఎ.మాధురి సిల్వర్ మెడల్ సాధించారు. బాలుర విభాగంలో టి.జీవన్, జి.మహేష్, ఎం.సాయి, జి.సాత్విక్, ఎస్.షణ్ముక్ గోల్డ్ మెడల్ సాధించగా, ఎం.శ్రీహర్ష, ఎం.సాయి ప్రణవ్ సిల్వర్ మెడల్ సాధించారు. గెలుపొందిన విద్యార్థులకు కరాటే బెల్టులు, సర్టిఫికెట్లు, మెడల్స్ అందజేశారు. ప్రతిభ చూపిన విద్యార్థులను, శిక్షణ ఇచ్చిన కోచ్‌లను సోమవారం పట్టణంలో పలువురు అభినందించారు.



జిల్లా స్థాయి పోటీల్లో గోల్డ్ మెడల్ సాధించిన విద్యార్థులు

చిరు జల్లుల వల్ల పంటలకు నష్టం లేదు

మండల వ్యవసాయ శాఖ అధికారి యలమందారెడ్డి

కారెంపూడి: ప్రస్తుతం పడుతున్న తేలిక పాటి జల్లుల వల్ల పంటలకు నష్టం లేదని ఇంకా బాగా పడితే పొలాలు పదును అవుతాయని మెట్ట పంటలకు మేలు జరుగుతుందని మండల వ్యవసాయశాఖ అధికారి బి.యలమందారెడ్డి సోమవారం తెలిపారు. పెద్ద వర్షం పడితే పంటలకు పదును ఈ నెలాఖరు వరకు ఉంటుందని మెట్ట పంటలకు చాలా ఉపయోగమన్నారు. మండలంలో వేసిన 2,200 ఎకరాలలో వేసిన మిర్చి పంట ప్రస్తుతం పూత దశలోనే ఉందని వర్షం వల్ల మిర్చికి నష్టం జరగదన్నారు. కాయ దశలో ఉన్నా పెద్ద వర్షం అయితే కాయకుళ్లు వచ్చే అవకాశం ఉందన్నారు. ఇదిలా ఉంటే సోమవారం కారెంపూడి మండలంలో చిరు జల్లులే పడ్డాయి. వర్షం మాత్రం పెద్దగా పడలేదు. ఇప్పటికి పంటలకు నష్టం లేదని ఇంకా బాగా పడితే వర్షాధార పంటలకు మేలు జరుగుతుందని రైతులు చెబుతున్నారు.



కోత దశలో ఉన్న వరి పంట

నాగసరపు రామారావుకు ఘననివాళి

నరసరావుపేట ఈస్ట్: ఆధ్యాత్మిక, విద్య, సేవారంగాల్లో నాగసరపు రామారావు సేవలు అందరికీ ఆదర్శప్రాయమని పలువురు వక్తలు కొనియాడారు. సుబ్బరాయ అండ్ నారాయణ కళాశాలలో సోమవారం కళాశాల మాజీ కార్యదర్శి నాగసరపు రామారావు 11వ సంస్మరణ సభ నిర్వహించారు. రామారావు చిత్రపటానికి పూలమాలలు వేసి ఘన నివాళులర్పించారు. కళాశాల కార్యదర్శిగా 55 సంవత్సరాల పాటు సేవలు అందించి పల్నాడు ప్రాంతంలో విద్యా ప్రదాతగా రామారావు సేవలు అందించారని తెలిపారు. అలాగే పట్టాభిరామస్వామి ఆలయ ధర్మకర్తగా ఆధ్యాత్మిక కార్యక్రమాలతో పాటు సామాజిక సేవారంగంలో గణనీయమైన సేవలు అందించారని కొనియాడారు. రామారావు అందించిన సేవలకు గుర్తుగా ఇందిరాప్రియదర్శిని అవార్డుతోపాటు ఆచార్య నాగార్జున విశ్వవిద్యాలయం ప్రతిభా పురస్కారంతో గౌరవించారని తెలిపారు. సంస్మరణ సభకు రామారావు కుమారుడు, కళాశాల కార్యదర్శి నాగసరపు సుబ్బరాయగుప్త అధ్యక్షత వహించారు. కళాశాల పాలకవర్గ అధ్యక్షుడు కపలవాయి విజయకుమార్, ఉపాధ్యక్షుడు పెనుగొండ వెంకటేశ్వరరావు, రామారావు మనుమలు రూపేష్ గుప్త, రాందేవ్ గుప్త, ప్రిన్సిపాల్ డాక్టర్ సోము మల్లయ్య, వైస్ ప్రిన్సిపాల్ డాక్టర్ ఎం.ఎస్.సుధీర్, కమిటీ సభ్యులు పాల్గొన్నారు.



రామారావు చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న కళాశాల పాలకవర్గ ప్రతినిధులు, అధ్యాపకులు

రూ.80లక్షలతో కోటప్పకొండ అభివృద్ధి పనులు

నరసరావుపేట రూరల్: భక్తులకు ఎలాంటి అసౌకర్యం లేకుండా కోటప్పకొండపై మౌలిక వసతులు కల్పిస్తున్నట్లు ఎమ్మెల్యే డాక్టర్ గోపిరెడ్డి శ్రీనివాసరెడ్డి తెలిపారు. కోటప్పకొండలో దాదాపు రూ.80లక్షలతో చేపట్టిన అభివృద్ధి పనులను సోమవారం ఎమ్మెల్యే డాక్టర్ గోపిరెడ్డి పూజలు నిర్వహించి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కోటప్పకొండ అభివృద్ధికి చిత్తశుద్ధితో కృషిచేస్తున్నట్టు తెలిపారు. కొండపై అభివృద్ధి పనులు నిరంతరాయంగా కొనసాగుతాయన్నారు. స్వామివారి దర్శనానికి వచ్చే భక్తులకు నిత్యాన్నదానాన్ని ఆలయంలో నిర్వహిస్తున్నట్టు తెలిపారు. ఇందుకోసం చిలకలూరిపేటకు చెందిన దాతలు తేళ్ల సుధీర్, శ్రీధర్ సహకారంతో నిత్యాన్నదాన మండపాన్ని అందుబాటులోకి తీసుకువచ్చినట్టు తెలిపారు. అలాగే నూతనంగా వంటశాల, వసతి గదులు, లిఫ్ట్‌తో పాటు పలు నిర్మాణాలను కొండపై చేపడుతున్నట్టు వివరించారు. మహాశివరాత్రి రోజున నిర్వహించే తిరునాళ్లకు ఆయా పనులు అందుబాటులోకి వస్తాయని వివరించారు. జెడ్పీటీసీ పదముత్తం చిట్టిబాబు, ఎంపీపీ మూరబోయిన శ్రీనివాసరావు, ఆలయ ఈఓ గొలమూరి శ్రీనివాసరెడ్డి, ఆలయ కమిటి సభ్యులు మట్లా లింగారెడ్డి, వంపుగుడి జానయ్య తదితరులు పాల్గొన్నారు.



కోటప్పకొండలో అభివృద్ధి పనులకు శంకుస్థాపన చేస్తున్న ఎమ్మెల్యే డాక్టర్ గోపిరెడ్డి

ప్రజలు అప్రమత్తంగా ఉండాలి

రెంటచింతల: నైరుతి బంగాళాఖాతంలో ఏర్పడిన తీవ్ర వాయుగుండం ప్రస్తుతం మరింత బలపడి తుపాన్‌గా మారిన నేపథ్యంలో కురుస్తున్న వర్షాలతో మండల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని తహసీల్దార్ కట్టేకోట పుల్లారావు అన్నారు. సోమవారం తహసీల్దార్ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకర్ల సమావేశంలో ఆయన మాట్లాడుతూ తుపాన్ కారణంగా రానున్న రెండు, మూడు రోజులు వర్షాలు కురిసే అవకాశం ఉందన్నారు. వర్షాలకు పాతకాలం నాటి శిథిలావస్థలో ఉన్న మట్టిమిద్దెల గోడలు పడిపోయే ప్రమాదం ఉన్నందున అలాంటి చోట నివసించేవారు వెంటనే ఇల్లు విడిచి సురక్షిత ప్రాంతాలకు వెళ్లాలని సూచించారు. గ్రామ పరిసరాలలో పొంగుతున్న వాగులు, కుంటల వద్దకు చిన్న పిల్లలను వెళ్లకుండా చూడాలన్నారు. పొలాల్లో విద్యుత్ మోటర్లు ఆన్ చేసే సమయంలో రైతులు జాగ్రత్తగా ఉండాలన్నారు. గ్రామాలలోని పరిస్థితులను ఎప్పటికప్పుడు తెలుసుకునేందుకు ఆయా గ్రామాల వీఆర్వోలకు సూచనలు చేయడం జరిగిందన్నారు. ఏమైనా అనూహ్య ఘటనలు జరిగిన వెంటనే తహసీల్దార్ కార్యాలయం నంబర్ 9959110777కు తెలియపరచాలని కోరారు.

అన్నదానం

విజయపురిసౌత్: మాచర్ల మండల పరిషత్ అధ్యక్షురాలు బూడిద మంగమ్మ తనయుడు శ్రీనివాసరావు ఆధ్వర్యంలో విజయపురిసౌత్‌లో మాలాధారులకు అన్నదానం నిర్వహించారు. సోమవారం కార్తీక మాసాన్ని పురస్కరించుకొని విజయపురిసౌత్ లాంచీ స్టేషన్ సమీపంలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ఎంపీపీ తనయుడు బూడిద శ్రీనివాసరావు, జిల్లా గొర్రెల పెంపకం దార్ల అధ్యక్షుడు బూడిద సైదులు భారీ స్థాయిలో అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. అంతకుముందు అయ్యప్పస్వామి, శ్రీకృష్ణ దేవాలయాలలో ప్రత్యేక పూజలు, భజన కార్యక్రమాలు నిర్వహించారు. ఈ సందర్భంగా వందలాది మంది అన్నదానానికి తరలి వచ్చారు



సాఫ్ట్ స్కిల్స్‌తోనే పోటీ ప్రపంచంలో ఉన్నతి

గుంటూరు ఎడ్యుకేషన్: సాఫ్ట్ స్కిల్స్‌ను అభివృద్ధి పరచుకోవడం ద్వారా విద్యార్థులు పోటీ ప్రపంచంలో రాణించాలని గుంటూరు చలమయ్య-కర్పూరపు వెంకట నారాయణ డిగ్రీ కళాశాల కార్యదర్శి కర్పూరపు రామకృష్ణప్రభు పేర్కొన్నారు. సంగడిగుంటలోని కళాశాలలో విద్యార్థులకు సాఫ్ట్ స్కిల్స్‌పై నిర్వహించిన శిక్షణ తరగతులు సోమవారం ముగిశాయి. ఈ సందర్భంగా రామకృష్ణ ప్రభు మాట్లాడుతూ ఆధునిక పోటీ ప్రపంచంలో విద్యార్థులకు ఇటువంటి శిక్షణ తరగతుల్ని నిర్వహించడం ఎంతో అవసరమన్నారు. ప్రముఖ ఇంజినీరు సర్వేశ్వరరావు మాట్లాడుతూ వేలాది రూపాయలు ఖర్చు కాగలిగిన కోర్సును మ్యాజిక్ బస్ ఇండియా ఫౌండేషన్ విద్యార్థులకు ఉచితంగా అందించడం గొప్ప విషయమని, శిక్షణ పొందిన విద్యార్థులు ఉన్నత ఉద్యోగాలను సాధించాలని ఆకాంక్షించారు. మ్యాజిక్ బస్ ఇండియా ఫౌండేషన్ సాఫ్ట్‌స్కిల్స్ ట్రైనర్ కిరణ్‌కుమార్ మాట్లాడుతూ గత 15 రోజులుగా కళాశాలలో డిగ్రీ తృతీయ సంవత్సరం చదువుతున్న విద్యార్థులకు కమ్యూనికేషన్, ఇంటర్వ్యూ, ఎంప్లాయిమెంట్ స్కిల్స్‌పై శిక్షణ కల్పించినట్లు వివరించారు. ఎంతో ఖర్చుతో కూడుకున్నదైనప్పటికీ డిగ్రీ విద్యార్థులకు ఉచితంగా అందించినట్లు చెప్పారు. అనంతరం విద్యార్థులకు సర్టిఫికెట్లు ప్రదానం చేశారు. కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్ మహంకాళి శ్రీనివాసరావు, అధ్యాపకులు, విద్యార్థుల తల్లిదండ్రులు పాల్గొన్నారు.

బీజేపీ వైఫల్యాలను ఎండగట్టడమే సీపీఎం లక్ష్యం

నరసరావుపేట: దేశంలో పెరుగుతున్న మతోన్మాదాన్ని కూకటి వేళ్లతో పెకలించాలంటే బీజేపీని ఓడించడం ద్వారానే సాధ్యమని, మోదీని ఓడించండి అనే నినాదంతో తమ పార్టీ నిత్యం ప్రజల్లో ఉంటుందని సీపీఎం రాష్ట్ర కమిటీ సభ్యుడు వి.కృష్ణయ్య అన్నారు. సోమవారం కోటప్పకొండరోడ్డులోని పల్నాడు జిల్లా కేంద్రంలో పార్టీ పల్నాడు జిల్లా కమిటీ సమావేశం జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు అనుముల లక్ష్మీశ్వరరెడ్డి అధ్యక్షత నిర్వహించారు. కృష్ణయ్య మాట్లాడుతూ ఇటీవల నాలుగు రాష్ట్రాల్లో జరిగిన ఎన్నికల్లో మూడు రాష్ట్రాలలో బీజేపీ అత్యధిక మెజార్టీతో గెలుపొందడం చూస్తే మతోన్మాద ప్రమాదం ఏ స్థాయిలో ఉందో తేటతెల్లమైందన్నారు. ఆ పార్టీ వైఫల్యాలను ప్రజల్లోకి తీసుకువెళ్లి దాని వలన దేశానికి, కార్మికులు, కర్షకులు, ఉద్యోగులకు కలిగే నష్టాలను వివరిస్తూ ఆ పార్టీ విధానాలను ఎండగట్టడమే పనిగా పెట్టుకొని తమ పార్టీ నిత్యం ప్రజల్లో ఉంటుందన్నారు. నిత్యం ప్రజలను చైతన్యం చేస్తున్న తమ పార్టీకి ప్రజలు మద్దతు ఇవ్వాలని కోరారు. జిల్లా కార్యదర్శి గుంటూరు విజయకుమార్, జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు ఏపూరి గోపాలరావు, జి.రవిబాబు, వై.రాధాకృష్ణ, జిల్లా కమిటీ సభ్యులు డి.శివకుమారి, జి.మల్లీశ్వరి పాల్గొన్నారు.